www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 16 | శనివారం | 29 జూన్ 2024



చరిత్ర సృష్టించిన టీమిండియా ఓపెనర్!

8 లో..

## వాయిదాలతో మొదలైన పార్లమెంట్

నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షం పట్టు

చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్

తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా

గందరగోళం మధ్య జులై 1కి వాయిదా

2 లో..





## పీవీకి నివాళి అర్పించిన సీఎం రేవంత్

మంత్రులు భట్టి, ఉత్తమ్ శ్రద్ధాంజలి

2 లో..



## బీఆర్ఎస్‌లో మరో వికెట్ డౌన్

- కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 28 : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో తాజాగా ఆ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ లో చేరారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో

మిగతా 2 లో

"పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? ఎక్కడైతే పార్టీని వీడారో అక్కడ మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందాం. తెలంగాణ ఉద్యమంలో తాను బయలుదేరినప్పుడు ఎంపీలు, ఎమ్మెల్యేలు లేరు. కొన్నికొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో కూడా అదే జరిగింది."

\- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు

### మెరికల్లాంటి నేతలను తయారు చేసుకుందాం

తెలంగాణ ఆర్తి మనకే బాగా తెలుసు

తెలంగాణ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేది మనమే

పార్టీని నేతలెవరూ ప్రభావితం చేయలేరు

నిజామాబాద్, కరీంనగర్ నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

గజ్వేల్, ప్రజానావ: పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు.

మిగతా 2 లో

## కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం

2 లో..



## ఎమ్మెల్సీ కవితతో హరీశ్ రావు భేటీ

ధైర్యంగా ఉండాలని హితవు



2 లో..

## మొహర్రం నిర్వహణకు ఏర్పాట్లు

అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం

2 లో..





## నేడు కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం

పవన్ కళ్యాణ్ రాకతో భారీగా ఏర్పాట్లు

ఖైరతాబాద్, ప్రజానావ: జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఏపీ పోలీసులు పవన్ పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. వారాహి అమ్మవారి దీక్షలో పవన్ కల్యాణ్.. శనివారం ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో కొండగట్టుకు బయల్దేరనున్నారు. ఉదయం 11 గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామి

మిగతా 2 లో

## ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

- త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం
- కేంద్ర బృందం వచ్చేలోగా నివేదికలు సిద్ధం
- అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ: మనం నిర్మించే ప్రతి రోడ్డు ప్రజలకు ఉపయోగపడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉందన్నారు. జులై మొదటి వారంలో ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరై పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం పనులు ఆగిపోయినవి, అప్‌గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమస్త సమాచారంతో సిద్ధంగా ఉండాలని

మిగతా 2 లో



## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు

కారులోనే ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి

ఘటనా స్థలిని పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు

2 లో..

## షాద్‌నగర్ పరిశ్రమలో పేలిన కంప్రెషర్

ఆరుగురు మృత్యువాత

2 లో..

# వాయిదాలతో మొదలైన పార్లమెంటు

## నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షం పట్టు

## చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్

## తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా

## గందరగోళం మధ్య జులై 1కి వాయిదా



**న్యూఢిల్లీ, జూన్ 28 :** లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమ వారానికి వాయిదా పడింది. సాధారణ సమావే శాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని, వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగం పై చర్చ ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడిరది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వీరిడియాతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలని అన్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. సోమ,మంగళ వారాలు సభలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాలతో ముగిసాయి. బుధవారం స్పీకర్ ఎన్నిక జరిగింది. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.

# దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉందని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ధైర్య వచనాలు చెప్పారు. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దనీ, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదని పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. ఏ హోదాలోవున్న కానీ ప్రజల కోసం పని చేయాల్సిందేనని, అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను బీఆర్‌ఎస్ మాత్రమే నెరవేరుస్తుందన్నారు. ఆనాడు ఉద్యమంలకు దిగినప్పుడు మనతో ఎవరున్నారు?. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్‌గా మరోపక్క ఎమ్మెల్యేగా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. గత 15 రోజులుగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కొనసాగుతున్న కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులు బ్రేక్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. కేసీఆర్‌తో పార్టీ ముఖ్యనేతలు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశాల పునఃప్రారంభ వివరాలను, ఏ నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే గత రెండు వారాలుగానియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నేతలను భేటీ అవుతున్నారు. తనను చూసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వస్తున్న ప్రజలతో ఓపికగా కలుస్తున్నారు.



గంటల పాటు నిలబడి వారిని కేసీఆర్ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతున్నారు. గత 15 రోజుల్లో దాదాపు 50 వేలకు పైగా ప్రజలు తమ అభిమాన నేతను కలిసి తమ ఆనం దాన్ని, కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ

### నివాళి అర్పించిన మాజీ సీఎం కేసీఆర్

**ఖైరతాబాద్, ప్రజానావ:** బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తి చాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.

# బీఆర్‌ఎస్‌లో మరో వికెట్ డౌన్

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి చేరుకుంది. కాగా ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్ కుమార్, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీగా పని చేసి, 2009లో చేవెళ్ల నియోజకవర్గం నుండి పోటిచేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోరాని సాయన్న రత్నం చేతిలో ఓడిపోయాడు. 2014 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కోరాని సాయన్న రత్నంపై 781 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం టీఆర్‌ఎస్ పార్టీలో చేరాడు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి 33 వేల 552 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో గెలిచారు.

## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**న్యూఢిల్లీ, జూన్ 28 :** తనకు రాజకీయాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అధికార పార్టీలో ఉంటే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతోనే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. అధికారంలో ఉంటే వెసులబాటు తెలియంది కాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయాక, పార్లమెంట్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకుందామనుకున్న బీఆర్‌ఎస్‌కు అడుగడుగునా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేకపోవడం.. లోక్‌సభ ఎన్నికల ముందు సిట్టింగ్ ఎంపీలే జంప్ అవ్వడం, టికెట్ దక్కించుకున్న తర్వాత ఊహించని రీతిలో ర%ఖ%లక్ ఇచ్చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం గమనార్హం. ఈ షాక్‌ల నుంచి తేరుకోకముందే వరుసగా నలుగురు ఎమ్మెల్యేలు ఈ మధ్య కాలంలోనే బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పేయడంతో కారు పార్టీ కంగుతిన్నది. ఇలా ఒక్కొక్కరుగా 'కారు' దిగుతుండగా.. తాజాగా చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, టి. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీల సమక్షంలో ఈ చేరిక జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పిన రేవంత్.. యాదయ్యను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు.. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

కాలె యాదయ్య.. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. తొలిసారి 2009 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్ స్థానమైన చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. టీడీపీ తరఫున పోటీ చేసిన కోరాని సాయన్న రత్నం గెలిచి.. ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరారు.

# నేడు కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ఆలయానికి ఆయన చేరుకోనున్నారు. గంటన్నర పాటు కొండగట్టు పుణ్యక్షేత్రంలో పవన్ గడపనున్నారు. ఆంజనేయస్వామికి పవన్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండగట్టు నుంచి మాదాపూర్‌కు రోడ్డు మార్గంలో తిరిగి రానున్నారు. సాయంత్రం 4.30కు మాదాపూర్ చేరుకోనున్నారు. శనివారం రాత్రికి హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ బస చేయనున్నారు. పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి దీక్ష వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలవడంతో పవన్ కల్యాణ్ జూన్ 26న వారాహి అమ్మవారి దీక్షను తీసుకున్నారు. 11 రోజుల పాటు నిష్టగా ఈ దీక్షను పవన్ కల్యాణ్ పాటించనున్నారు. పసుపు రంగు దుస్తుల్లో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉన్న పవన్ కల్యాణ్ ఫొటోలు చూసి ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. అయితే ఈ దీక్ష దుస్తుల్లో ఉన్న పవన్ కల్యాణ్ చెప్పులు వేసుకుని కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

# పీవీకి నివాళి అర్పించిన సీఎం రేవంత్

## మంత్రులు భట్టి, ఉత్తమ్ శ్రద్ధాంజలి

**న్యూఢిల్లీ, జూన్ 28 :** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి పివి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్‌లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు. ఆ రోజుల్లో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారని..ఇపుడు స్పీకర్ ఓం బిర్లా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా స్పీకర్ చర్యలు న్నాయన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పార్లమెంట్ లో కొట్లాడుతామన్నారు ఎంపీ వంశీకృష్ణ. నీట్ పేపర్ లికేజ్ పై చర్చ చేపట్టాలంటూ విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ లోక్ సభ వెల్ లో ఆందోళనలు చేశామన్నారు.దేశం అత్యంత క్లిష్ట సమయంలో ఉన్న దశలో దేశానికి ఒక దిశను చూపించిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఎంపీ మల్లు రవి అన్నారు. ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ తో కలిసి వ్యవస్థను గాడిలో పెట్టి భారత్‌ను ప్రపంచ దేశాల సరసన నిలిపారన్నారు. ఆయనతో పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు.

# కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

## తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని, మెరిట్స్ లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, వీరిడియాకు వివరాలు వెల్లడిరచకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడిరచిన మేరకు విచారణ జరిగింది.

# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు

**న్యూఢిల్లీ, జూన్ 28 :** ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్-1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్%-%1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొంటున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరితా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి నుంచి ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయి. రోడ్లపైకి వర్షం నీళ్లు చేరడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐతే ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈసందర్భంగా విమానయాన శాఖ మంత్రి రామ్మోమన్ నాయుడు వీరిడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు.ఇక్కడ వీరికు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉందని వెల్లడించారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. 'దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుందని వెల్లడిరచారు. విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం' అని దుయ్యబట్టారు. ఈ విమర్శలను ఉద్దేశించే కేంద్రమంత్రి బదులిచ్చారు. అదంతా తప్పుడు సమాచారం అని కొట్టిపారేశారు. కూలిపోయిన ఈ టర్మినల్ పైభాగాన్ని 2008-09 సంవత్సరంలో నిర్మించారని తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడిరచారు. అలాగే సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు. ఇక ఈ ఘటనతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వారు ప్రయాణించాల్సిన విమానాల గురించిన సమాచారం అందక గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో డీజీసీఏ విమానయాన సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యామ్నాయ విమానాలు ఏర్పాటుచేయాలని, విమానాలు రద్దయితే టికెట్ రీఫండ్ ఇవ్వాలని వెల్లడిరచింది. ఘటన జరిగిన వెంటనే అత్యవసర సహాయ బృందాలు చర్యలు చేపట్టాయని, పలువురు గాయపడ్డారని, వారికి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. వెంటనే... టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చెక్ ఇన్ కౌంటర్లు అన్ని మూసి వేశామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.



# మొహర్రం నిర్వహణకు ఏర్పాట్లు

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం**
**భారీబందోబస్తు ఏర్పాటుకు ఆదేశం**

**ఖైరతాబాద్, ప్రజానావ:** మొహర్రం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రధాన ఏనుగు ఊరేగింపు రోజున ఊరేగింపు జరిగే మార్గాల లో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగు నీరు అందించాలని, జి. హెచ్.యంసి అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ–కా–ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సంతాపం తెలిపెందుకు ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వారి కోసం మినీ బస్సులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నా రు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మిర్జా రహమత్ బేగ్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మెరాజ్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫెకర్ అలీ, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, వైస్ ఛైర్మన్ ,ప్రెసిడెంట్ ఫహీమ్ ఖురేషి, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉఊఓఅ కమిషనర్ అమ్రపాలి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా
# నేడు బీజేపీ కార్యాలయం ముట్టడి

**ఆఫ్ కన్వీనర్ దిడ్డి సుధాకర్**

**బషీర్‌బాగ్, ప్రజానావ:** బిజెపి కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీ పిలుపు మేరకు జూన్ 29న తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యాలయం (నాంపల్లి)ముందు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల నిరసన దీక్ష జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది ఆ మరుసటి రోజే ఈడీ హైకోర్టుకు చేరుకుని కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే తీసుకుందన్నారు. రెండేళ్లుగా గాఢనిద్ర నుంచి మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడంతో ఈ కేసులో బెయి–ల్‌పై నిషేధం హైకోర్టు ఎత్తివేయనుందని తెలిపారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను గత రెండేళ్ల వరకు మద్యం కేసులో సీబీఐ నిందితుడిగా చేర్చలేదని, అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుంచి బెయిల్ పొందబోతున్నారని బిజెపి భావించినప్పుడు, అది సిబిఐని ముందుకు తెచ్చిందన్నారు. వారి ఉద్దేశ్యం ఏ కేసును విచారించడం కాదు లేదా వారికి చట్టంతో సంబంధం లేదు. ఎలాగైనా అరవింద్ కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచాలని, ఎన్నికలకు దూరంగా ఉంచాలని, ఆమ్ ఆద్మీ పార్టీని రద్దు చేయాలని బీజేపీ కోరుతోందనీ మండిపడ్డారు. అందుకే బీజేపీ తన రాజకీయ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు.2023 ఏప్రిల్ 16న మొదటిసారిగా సాక్షిగా కేజ్రీవాల్‌ను సీబీఐ విచారణకు పిలిచిందని, అప్పుడు ఆయన్ను ముద్దాయిని చేయలేదని 14 నెలలుగా కేజ్రీవాల్‌ను నిందితుడిగా చేయాలని సీబీఐకి గుర్తులేదా అని ప్రశ్నించారు. చాలా కాలం తర్వాత ఇప్పుడు హఠాత్తుగా మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందన్నారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌పై హైకోర్టు స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేయనున్న నేపథ్యంలో సీబీఐ ఈ చర్య తీసుకుందనీ, సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు అని అన్నారు. కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైల్లో ఉంచాలని బీజేపీ కోరుకుంటోందనీ తద్వారా ఎన్నికలకు దూరంగా ఉండి ఆప్ పార్టీ నాశనం అవుతుందని బిజెపి కలలు కంటుంది కాని అవి కలలు గానే మిగిలిపోతాయని స్పష్టం చేశారు.



# కేంద్ర ప్రభుత్వం భూములను
# వెనక్కు తిరిగి ఇవ్వాలి

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, ప్రజానావ:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్ యూ) లకు రాష్ట ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామిని కోరారు. రాజధాని పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రితో సమావేశమై పలు అంశాలను చర్చించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వీటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని శ్రీధర్ బాబు అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సిసిఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాల ను మెరుగు పర్చాలని కోరారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామ–ర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని గుర్తు చేసారు. దీనిని ప్రయివేటు పరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీస్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినె స్ లో రాష్ట్రం ముందుంది. ఇక్కడ భూములు, నీరు, విద్యు త్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్ర మల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్డ్ మ్యాన్ పవర్ సమృ ద్ధిగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్ కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.



## దక్షిణ పెరూలో
# భారీ భూకంపం

**రిక్టర్ స్కేలుపై 7.2గా తీవ్రత నమోదు**

**లిమా:** దక్షిణ పెరూలో భారీ భూకం పం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకా రం శుక్రవారం తెల్లవారుజామున 12.30 నిమిషాలకు భూకంపం వచ్చిందని, దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైనట్లు అధికా రులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుందని అన్నారు. భూకంప కేంద్రం కారవెలి ప్రావిన్స్‌లో ఆంటిక్విపా జిల్లాకు పశ్చిమాన 8 కి.మీ దూరం లో ఫసిఫిక్ సముద్రంలో భూకంప కేంద్రం ఉంది. చిలీ, బలీవియా సరిహద్దుకి సమీపాన రాజధాని లిమాకు 380 మైళ్ల దూరంలో ఉంది. 28 కి.మీ లోతులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాజధాని లిమాతో పాటు ఐకా, అయాకుచో ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ప్రధాన రహదారి పై రాళ్లు పడటంతో జిల్లాకు ఇతర ప్రాంతా లతో సంబంధాలు తెగిపోయినట్లు అయాకుచో ప్రాంతంలోని శాంకోస్ జిల్లా మేయర్ స్థానిక మీడియాకు తెలిపారు.

# ఎమ్మెల్సీ కవితతో హరీశ్ రావు భేటీ

**ధైర్యంగా ఉండాలని హితవు**

**న్యూఢిల్లీ, జూన్ 28:** తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమా లు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూల్కై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిం ది. అధికారులు జూన్ 21వ తేదీన ఆమెను వర్చు వల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు.

# ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా రోజూ పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. ఎన్ని కోట్లు పెట్టిన పోయిన ప్రాణం తిరిగి రాదని.. ప్రభుత్వం నిర్మించాల్సిన రోడ్డు మూలంగా ప్రజల ప్రాణాలు పోతే.. ఇక ప్రభుత్వం ఉండి ఎందుకని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో జాతీయ రహదారులపై ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మంత్రి సమిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారంగా మారనున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ విషయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆర్ఆర్ఆర్ విషయంలో మరింత చురుగ్గా పనులు చేయాలని మంత్రి సూచించారు. ఒక్క ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభమైతే రాష్ట్రానికి ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డిస్నీల్యాండ్ వంటి ప్రఖ్యాత సంస్థలు, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పడి రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం 930 చెట్లను రిలోకేట్ చేయాల్సి ఉండటంతో పాటు పలు అనుమతుల వల్ల ఆలస్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరించారు. అప్పుడు చెట్లు లేకుండా రోడ్ల నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ఎందుకు నిర్మించడం లేదని మరోసారి ప్రశ్నించారు. ఆలస్యానికి సాకులు వెతక్కుండా, జరగాల్సిన పనులు జరపాలని అన్నారు. ఇబ్బందులు ఉన్నచోట్ల సమస్యల్ని పరిష్కరించేందుకు మార్గం వెతకాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రీలోకేట్ చేయాల్సిన 330 చెట్లను కాంట్రాక్టు సంస్థతో రేపు మాట్లాడి చేయిస్తానని చెప్పారు. మిగితా వాటి సంగతిని వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఫోర్ క్లోజ్ చేసి, వచ్చే నెలలో కొత్త టెండర్లు పిలిచి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. ఇందులో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా ప్రతి నిత్యం పర్యవేక్షించాలని జాతీయ రహదారుల సంస్థ ఆర్వో రజాక్‌ను ఆదేశించారు. ఆర్మూర్–మంచిర్యాల జాతీయ రహదారి కోసం 630 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా.. ఇప్పటికే 530 హెక్టార్లు సేకరించామని ఈ సందర్భంగా మంత్రికి అధికారులు తెలిపారు. మిగతా పనులను ఈ నెలలో పూర్తి చేస్తామని వివరించారు. వీటితో పాటు ఉప్పల్–ఘట్ పనులపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాల మేరకు ఫోర్‌క్లోజ్ చేసి కొత్త టెండర్లు పిలుస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా సంస్థలను ఖరారు చేయాలన్నారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎల్బీనగర్–మల్కాపూర్ రోడ్డులో మన్నెగూడ మలుపు వద్ద నిర్మించాల్సిన బ్రిడ్జ్ గురించి అధికారులు వివరించగా పరిష్కారానికి హామీ ఇచ్చారు.



# హేమంత్ సోరెన్‌కు బిగ్ రిలీఫ్

- భూ కుంభకోణం కేసులో బెయిల్
- ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు
- హర్షం వ్యక్తం చేసిన జేఎంఎం శ్రేణులు

**జార్ఖండ్:** జార్ఖండ్ మాజీ ముఖ్యమం త్రి హేమంత్ సోరెన్‌కు భారీ ఊరట దక్కింది. భూ కుంభకోణం కేసులో అరెస్టైన ఆయనకు జార్ఖండ్ హైకోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో రాంచీలోని బిర్సా ముండా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన హైకోర్టు తీర్పుతో ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చారు. జార్ఖండ్ ముఖ్య మంత్రిగా ఉన్న హేమంత్ సోరెన్‌ను భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు సోరెన్ సమాధానం దాటవేస్తున్న క్రమంలో మనీలాండరింగ్ నియంత్రణ చట్టం(పీఎంఎ ల్‌ఏ) కింద ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి జైల్లోనే ఉన్న ఆయన దాదాపు ఐదు నెలల తర్వాత ఇప్పుడు బెయి–ల్‌పై బయట కు రాబోతున్నారు. కాగా, అరెస్ట్ అనంతరం సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసిన విష యం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో జార్ఖండ్ ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ బాధ్య తలు చేపట్టారు. ఇక భూ కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు జా ర్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆయన భార్య కల్పనా సోరెన్ స్వాగతించారు. ఎన్నో నెలల తర్వాత సంతోషకరమైన రోజు ఎదురైందని హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలం లో తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆమె పేర్కొన్నారు.

**జేఎంఎం శ్రేణుల ఆనందం**

హేమంత్ సోరెన్ ప్రస్తుతం జార్ఖండ్ ముక్తి మో ర్చా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ యనకు బెయిల్ మంజూర్ కావడంపై పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాలతో మిఠాయిలను పం చుకున్నారు. సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు జనవరి 31న అరెస్టు చేశారు. సోరెన్‌ను అన్యాయంగా టార్గెట్ చేశారని, ఆ యనపై పెట్టింది రాజకీయ ప్రేరేపిత, కల్పిత కేసు అని ఆయన తరఫు న్యాయవాది, సీనియ ర్ అడ్వొకేట్ మీనాక్షి అరోరా వాదించారు.

# షాద్‌నగర్ పరిశ్రమలో పేలిన కంప్రెషర్

**ఆరుగురు మృత్యువాత**

**షాద్‌నగర్, ప్రజానావ:** రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాసు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మంటలు చెలరేగడంలో మరికొంత మందికి తీవ్ర గాయాల య్యాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్న ట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంట లు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఒకేసారి కంప్రెషర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ దుర్ఘటన ఎలా జరిగిం దనే దానిపై ఇంకా ఆరా తీస్తున్నారు. మృతులు ఒడి శా, బిహార్, యూపీ వాసులుగా గుర్తించారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మాని యా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఇలాంటి ఘటన జరిగినప్పుడే కార్మికుల భద్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసు కోవాలని ఇచ్చిన సూచనల్ని ఏమేరకు పాటించారనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్న ట్లు సమాచారం. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# డిండి ప్రాజెక్ట్ నీటి విడుదల



**అచ్చంపేట, ప్రజానావ:** డిండి మండల పరిధిలో ఉన్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్ట రైతాంగానికి శుక్రవారం దేవరకొండ, అచ్చంపేట ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, చిక్కుడు వంశీకృష్ణ, ప్రాజెక్టు అధికారి ఈ శ్రీధర్ రావు కలిసి గేట్లను ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అది శాసనమని ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15వ తేదీ లోపు చేయబోతున్నామని, వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. రైతు భరోసాతో ద్వారా రైతులకు సంవత్సరానికి రెండు దఫాలుగా ఎకరాకు 7500 అందిస్తామని, రైతులను రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం 26 వేల కోట్ల రూపాయలను రైతుబంధు ద్వారా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరం దేవేందర్ రావు, మాధవరం సునీత, నల్లవెల్లి రాజేష్ రెడ్డి, దొంతినేని వెంకటేశ్వరరావు, దొంతినేని యాదగిరిరావు, మల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, తిప్పర్తి విజయేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బుషిపాక వెంకటయ్య, ఆమనగంటి రాధిక, నూకం వెంకటేష్, పొలం లక్ష్మణ్,వావిళ్ళ సలయ్య పాల్గొన్నారు.



## శృంగేరీ శారదాపీఠాన్నీ దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది

**వేములవాడ, ప్రజానావ :** కర్నాటకలోని శృంగేరీ శారదాపీఠంలోని శ్రీ శారదా మాత అమ్మవారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా వ్యాసోజ్జాల రాధాకృష్ణ శర్మతో కలసి దర్శించుకున్నారు. అమ్మవారికి సువర్ణ పుష్పసేవ నిర్వహించారు. అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం శృంగేరీ శారదాపీఠం పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి స్వాముల వారిని దర్శించి స్వాముల వారికి భిక్షా వందనం, పాదపూజ నిర్వహించి, ఫలాలు సమర్పించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ దేవస్థానం అభివృద్ధికి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి స్వామి పలు సలహాలు, సూచనలు చేసినట్లు చెప్పారు.

### రేవంత్ పాలన బాగుంది..

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన బాగుందని, రానున్న రోజుల్లో వారి పరిపాలన సుభిక్షంగా జరగాలని, రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోవాలని దీవించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శృంగేరీ శారదాపీఠం పీఠాధిపతులు జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధు శేఖర భారతి స్వాముల వారిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవాల్సిందిగా కోరగా, వారు సానుకూలంగా స్పందించారు.

# మీ ఆరోగ్యం ఎలా ఉంది?

- సౌకర్యాలు ఎలా ఉన్నాయి?
- వృద్ధుల ఆశ్రమం సందర్శనలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- బద్దెనపల్లి అంగన్వాడీ సెంటర్, వృద్ధాశ్రమం పరిశీలన

**తంగళ్లపల్లి, ప్రజానావ :** "మీ ఆరోగ్యం ఎలా ఉంది.. సౌకర్యాలు ఎలా ఉన్నాయి. భోజన వసతి ఎలా ఉంది" అంటూ వృద్ధులను ఆరా తీశారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని వృద్ధుల ఆశ్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఆశ్రమంలోని వంటగది, స్టోర్ రూం, డైనింగ్ హాల్, ఆటలను ఆడుకునే గదిని పరిశీలించారు. అనంతరం వృద్ధులను ఆత్మీయగా పలుకరించారు. వారి గదిలో కూర్చొని యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వృద్ధులను అడిగారు. వృద్ధులు నడిచేందుకు ఉపాధి హామీలో (వాకింగ్ ట్రాక్) మార్గం వేయాలని అధికారులకు సూచించారు. రోజూ ఏం కూరలు పెడుతున్నారు? ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా? అని వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూం లో అన్ని సరుకులు, ఫ్రిడ్జ్ లో ఆహార పదార్థాలు పరిశీలించారు.



### పిల్లల బరువు పరిశీలన

బద్దెనపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు హాజరు అయ్యారో రిజిస్టర్లో తనిఖీ చేశారు. విద్యార్థుల బరువును పరిశీలించారు. వంట గదిని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ అంగన్వాడిలో 24 మంది హాజరయ్యారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ స్థానిక మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీఓ అలేఖ్య ఉన్నారు.







## ఘనంగా పద్మావతి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం

**చందుర్తి, ప్రజానావ :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో పద్మావతి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని వేద మంత్రోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ జేపి రావు దంపతులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వంశీకృష్ణ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం కల్యాణం నిర్వహించారు. గ్రామ ప్రజలు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణతంతును వీక్షించి పునీతులయ్యారు.

## ఘనంగా పీవీ జయంతి వేడుకలు



**చందుర్తి, ప్రజానావ :** చందుర్తి మండల కేంద్రంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఏ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు కరీంనగర్ జిల్లా నుంచి దేశ ప్రధానిగా ఏదైనా గొప్ప నాయకుడిగా కొనియాడారు. 12 భాషల ప్రావీణ్యం పొందిన భాషా కోహితులని కొనియాడారు.



## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

**సిరిసిల్ల ప్రజానావ :** సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ ఈవీఎం గోదామును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ పరిశీలించి, రిజిస్టర్ లో సంతకం చేసి అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా సిరిసిల్ల ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ షరీఫ్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయికి బానిస కావొద్దు

- అనారోగ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమవుతారు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, ప్రజానావ:** యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దనే ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో పలు సందర్భాల్లో గంజాయి తాగుతూ పట్టుబడి వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా చాలావరకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు అనుకోకుండా నేరాలు చేసే అవకాశం ఉందన్నారు. దీంతో ఉద్యోగం రాదని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేరని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువకులు సత్ప్రవర్తనతో మంచి మార్గంలో నడుచుకోవడానికి ఈ కౌన్సిలింగ్ మంచి మార్గమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని లేదంటే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయికి అలవాటు పడి మానుకోలేని పరిస్థితి ఉన్న వారికి జిల్లాలో ఏర్పాటు చేయబడిన డీ అడిక్షన్ సెంటర్లో సైకలాజిస్ట్, సైక్రియాట్రిస్ట్ వైద్యులతో కౌన్సిలింగ్‌తో పాటు వైద్య సదుపాయాలు అందజేయడం జరుగుతున్నారు. మీ చుట్టుపక్కల లేదా గ్రామాల్లో ఎవరైనా గంజాయికి అలవాటు పడితే వారి వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు రఘుపతి, సదన్ కుమార్, ఎస్ఐ మల్లేశం సిబ్బంది ఉన్నారు.






## కోనరావుపేట ఎస్ఐ వేధింపుల నుంచి కాపాడండి

- చేయని పనిని ఒప్పుకోమని వేధిస్తుండు
- ట్రాక్టర్ సీజ్ చేసి బెదిరిస్తుండు
- విలేకరుల ముందు గోడు వెల్లబోసుకున్న బాధితుడు

**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల ఎస్ఐ ఆంజనేయులు వేధింపులకు గురి చేస్తున్నాడని, తను చేయని పని ఒప్పుకోమని బెదిరిస్తున్నాడని జై సేవాలాల్ ఊరుతండా గ్రామానికి చెందిన మాలోత్ నరన్ అనే వ్యక్తి శుక్రవారం విలేకరుల ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మపల్లి గ్రామానికి చెందిన నరన్ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత మంగళవారం ఎస్ఐ ఆంజనేయులు తన ట్రాక్టర్‌ను తీసుకొని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో వెళ్లానన్నారు. అయితే అక్కడ ఎస్ఐ నీవు దర్ర మల్లయ్య పొలం వద్ద రోడ్డును దున్నినవని నీపై కేసు పెట్టి బండిని సీజ్ చేస్తానని, ఈ నేరాన్ని ఒప్పుకోవాలని బలవంతం చేశాడన్నారు. నేను ఎలాంటి భూమిని దున్నలేదని నాకు ఆ విషయానికి ఎలాంటి సంబంధం లేదని రెండు, మూడు రోజుల నుంచి ప్రాధేయపడుతున్నా వినకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకవేళ తను తప్పు ఒప్పుకోకపోతే బండి బయటకు వస్తుందని, లేకపోతే ఇక్కడే తుప్పు పట్టి పోతుందని భయపెట్టిస్తున్నాడని వాపోయాడు. జీవనోపాధి నిమిత్తం ఈ బండిని ఫైనాన్స్‌లో కొనుక్కున్నానని, చేయని నేరం నుంచి ఉన్నతాధికారులు నన్ను, నా కుటుంబాన్ని కాపాడాలని కన్నీటి పర్యంతమయ్యాడు. ఒకవేళ ట్రాక్టర్ లోపలికి వెళ్తే నాకు నా కుటుంబానికి ఉపాధి లేదని, అందరం కలిసికట్టుగా చనిపోవాల్సి వస్తుందని ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేసి నా ట్రాక్టర్ ఇప్పించగలరని వేడుకున్నాడు. ఇదే విషయమై ఎస్సై ఆంజనేయులును విలేకరులు వివరణ కోరగా బాధితుడు తెలిపిన వివరాల ప్రకారమే ట్రాక్టర్‌ను తీసుకు రావడం జరిగిందని, దీనికి సంబంధించి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఏదేమైనా మండలానికి సంబంధించిన భూ తగాదాల్లో రెవెన్యూ అధికారులను సంప్రదించకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి అక్రమంగా కేసులు పెడుతున్నారని బాధితులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటపై ఎస్పీ స్పందించాలని కోరుతున్నారు.




## జీవితం నాశనం చేసుకోవద్దు

- గంజాయి తాగుతూ పట్టుబడ్డ వారికి పోలీస్ స్టేషన్లలో కౌన్సిలింగ్

**వేములవాడ, ప్రజానావ:** దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని, అలాంటి యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పోలీసులు సూచించారు. ఇటీవల గంజాయి తాగుతూ పట్టుబడిన వారికి ఎస్పీ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల సమక్షంలో వేములవాడ పట్టణ, రూరల్, బోయినపల్లి పోలీస్ స్టేషన్లలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, పృథ్వీధర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



# బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, ప్రజానావ:** బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్లు ప్రాధాన్యతారంగాలకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. 2023-24 ఆర్థిక సవత్సరంలో జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2024-05 సంవత్సరంలో 2223.41 కోట్లు రుణ మంజూరుకు కమిటీ ఆమోదించిందని తెలిపారు. ఈ సందర్భంగా 12 రంగాలకు 1991.55 కోట్లు రుణాలు మంజూరు. లక్ష్యం కాగా 1453.32 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎం ఈజీపీ లక్ష్యం 75 యూనిట్లుకు 243.74 కోట్లు లక్ష్యం కాగా 26 యూనిట్లు మంజూరు 96.31 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 35354 మందికి 209.94 కోట్లు ముద్ర రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యం మేరకు వ్యవసాయ, చేపలు పెంపకానికి, పామాయిల్ సాగు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు, మహిళ స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని, అట్టి ప్రాధాన్యతను గుర్తించి మహిళా సంఘాలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు రుణాలు మంజూరుకు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతగా మంజూరు చేసిన 10, 20 వేలు చెల్లించిన 186 మందికి వక్కొక్కరికి 50 వేలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మన జిల్లాను నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ జిల్లాగా ప్రకటించిందని, జిల్లాలో 50 కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటు లక్ష్యం కాగా 40 ఏర్పాటు చేశారని, మిగిలిన 10 ఏర్పాటు చేయాలని సూచించారు. కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటుకు 1.20 కోట్లు సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు. రేగొండలో బాంక్ బ్రాంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని ఎల్డీఎంకు సూచించారు. జిల్లాలో చేపలు, డ్రాగేన్ పండ్ల తోటలు, గొర్రెలు పెంపకానికి. మంచి అవకాశాలున్నాయని బ్యాంకర్లు ఇట్టి యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం తిరుపతి, ఆర్బీఐ నోడల్ అధికారి ఆలీబాబా, నాబార్డు ఈజీఎం రవి, డీఆర్డీఓ నరేష్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, మత్స్యశాఖ అధికారి అవినాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశాం

## జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

**భూపాలపల్లి, ప్రజానావ:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేశామని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం ఎస్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, విద్యాశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలపై ప్రధానంగా చర్చించారు. సంబంధిత జిల్లా అధికారులు ఆయా శాఖలలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతుండగా, వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జూలై 30 లోగా ప్రభుత్వ హామీ మేరకు రైతు భరోసా నిధులు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు పంపిణీ చేయాలని, అదేవిధంగా ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు పండించిన ధాన్యానికి 500 రూపాయల బోనస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టాలని ఓదెల జెడ్పీటిసి గంటా రాములు ప్రతిపాదించగా, పాలకుర్తి జెడ్పిటిసి కందుల సంధ్యారాణి దానిని బలపర్చరు. సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యుల అంగీకారంతో ఆ తీర్మానాన్ని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఆమోదించారు. విద్యా శాఖపై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడుతూ.., ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను, మన దగ్గర అందుబాటులో ఉన్న అనుభవం, నైపుణ్యం గల ఉపాధ్యాయుల వివరాలను తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. గతంలో ప్రారంభించిన సీఎం అల్పాహార పథకం అమలు వివరాలను సభ్యులు ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. వైద్యారోగ్య శాఖపై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడుతూ.. పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ఉచితంగా జరిగే వైద్య పరీక్షలపై సామాజిక మాధ్యమాలు, సిటీ కేబుల్ లలో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలు అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టుకుని ప్రైవేటు పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదనే సందేశం పంపాలని సభ్యులు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. జూలై 4, 2024తో స్థానిక సంస్థల గడువు ముగుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత 5 సంవత్సరాలుగా 20 జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించడం జరిగిందన్నారు. అమ్మ తనకు జన్మ నిస్తే, ఈ స్థాయికి ఎదిగేందుకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణమని, ఈ ఇద్దరికీ తాను జీవితాంతం కృతజ్ఞతతో ఉంటానని అన్నారు. దేశంలోనే అత్యున్నత సభగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని తాను భావిస్తానని, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, పార్లమెంట్ లోక సభలో ఎంపీలు మాత్రమే ఉంటారని, జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసే అధికారులు ఉంటారని, ప్రజా సమస్యలపై విస్తృతంగా ఇక్కడ చర్చ జరుగుతుందని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి దశ, దిశ చూపించే ఎంపీలు, ఎమ్మెల్యేలు సర్వసభ్య సమావేశంలో పాల్గొంటూ క్షేత్ర స్థాయి సమస్యల పట్ల అవగాహన కల్పించుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేశామని, దీనికి అధికారులు సంపూర్ణంగా సహకారం అందించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొని ప్రజా సమస్యలను అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీల దృష్టికి తీసుకుని వచ్చిన జిల్లా ప్రజా పరిషత్ సభ్యులకు, ఎంపీపీ అధ్యక్షులకు జెడ్పీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో స్థానిక సంస్థలు మరింత బలోపేతం కావాలని జెడ్పీ చైర్మన్ ఆకాంక్షించారు. అనంతరం పుట్ట మధుకర్‌ను సన్మానించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీ, కోఆప్షన్ మెంబర్‌లను, జెడ్పీ సీఈఓ అధికారులను జెడ్పీ చైర్మన్ సన్మానించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ పర్యటన



**భూపాలపల్లి, ప్రజానావ:** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం జిల్లాలోని చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా చిట్యాల మండలం జడల్ పేట, గాంధీనగర్, భీష్మనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. రామచంద్రపూర్ గ్రామంలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించినఅనంతరం చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి నుంచి మొగుళ్ళపల్లి మండలంలోని అరేపల్లి ప్రాథమిక పాఠశాల, ఇస్సిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న మౌలిక సదుపాయాలు కల్పన పనులను పరిశీలించివిద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పనతోపాటు పాఠశాలను ఆహ్లాదకకరంగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. చిట్యాల మండలంలో 25 పాఠశాలలను, మొగుళ్ళ పల్లి మండలంలో 22 పాఠశాలలో మరమ్మతులు జరుగుతున్నాయని, కొన్ని పాఠశాలలో మరమ్మతులు పూర్తయ్యాయని వాటికి వెంటనే పెయింటింగ్ పనులు చేయించాలన్నారు. పనులు పురోగతిలో ఉన్న పాఠశాలలలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నుంచే ఆరోగ్యవంతమైన పిల్లలు తయారు కావాలని అన్నారు. పిల్లలకు మేదా శక్తి పెంపొందించడానికి అంగన్వాడీలలో జులై నెల నుంచి పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. అంగన్వాడీ లలో పిల్లలకు ఏకరూప దుస్తులు ఆగస్టు 15 వరకు అందించనున్నట్లు తెలిపారు. బాల్యం నుంచి పిల్లలకు విద్యపై మక్కువ రావాలని, అందుకు అవగాహన కల్పించబోతున్నట్లు తెలిపారు. చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తల్లికి కడుపుకోతను తగ్గించేందుకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని అందుకు గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుంచే నిరంతర క్రమం తప్పక వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీడబ్ల్యుఓ అవంతిక, చిట్యాల సీహెచ్‌సీ సూపరిండెంట్ జీడీ తిరుపతి, చిట్యాల, మొగుళ్లపల్లి తహసిల్దార్లు, ఖాజా మోహినుద్దీన్, సునీత ఎంపీడీఓ, విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి పూజలు



**ఆమనగల్లు, ప్రజానావ:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం మైసమ్మ మైసమ్మ దేవస్థానం వద్ద 15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సతీ సమేతంగా మైసమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పిటిసి దశరథ్ నాయక్ కడ్తాల్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా పాఠశాలను ఈ సంవత్సరం నుంచే ప్రారంభించాలని కోరారు దానికి ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీకి చెప్పి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లి మోత్య నాయక్ ఎంపిటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నరసింహ, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గందోత్సవం వాల్ పోస్టర్లు విడుదల



**ఆమనగల్లు, ప్రజానావ:** 4వ గంథోత్సవం వచ్చే నెలజులై 1 నుంచి భార్గహే సయ్యదునా ముసఖాద్రి పురాణపుల్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న గంథోత్సవం వాల్ పోస్టర్లను అమనగల్లు పట్టణంలోని మహ్మదియా మస్జీద్ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి, నాయబ్ సదర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులతో విడుదల చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కత్మ ఖురాన్, సందల్, సమర్పించడం, ఉపన్యాస ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఇమామ్ అబూ తాలిబ్, మహ్మద్ అక్బర్, కమిటీ సభ్యులు చాంద్ పాషా, మహబూబ్ అలీ, ఖలీల్, అయ్యుబ్, రహీమ్, కరీం, బాసీద్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన అడిషనల్ డీఆర్డీఓ సురేష్



**ఆత్మకూరు(ఎం), ప్రజానావ:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో శుక్రవారం జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ(అడిషనల్ డిఆర్డీఓ) అదనపు కార్యనిర్వహణా ధికారి గుర్రం సురేష్ మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. రాఘూవాపురం, కూరెళ్ళ, పల్లెర్ల గ్రామాల్లో పర్యటించారు. త్వరలో వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామా లలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటేందుకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపట్టి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వనమహో త్సవం కార్యక్రమం మొదలైయే వరకు గుంతలు పూర్తి చే యాలని అన్నారు. అనంతరం ఆయాగ్రామాల్లో ఉపాధి హామీలో నిర్వహిస్తున్న ఫిష్ పాండ్, పారం ఫండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ యాప్ అయిన జనమనరేగాను ఏలా చూడాలో వివ రించినారు. వీరివెంటా ఉపాధి హామీ ఎపీఓ బోడిగే రమేష్, టీఏలు ఏగు మల్లేష్, జమాండ్ల యాదిరెడ్డి, ఆయాగ్రామాల ఏఫ్ఏలు ఇస్తారి, యాదమ్మ, సురేష్, కూలీలు ఉన్నారు.

# ఆర్థిక సాయం

**చింతపల్లి, ప్రజానావ:** చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట)గ్రామానికి చెందిన సందే ఇద్దయ్య అనారోగ్యంతో శుక్రవారం మరణిచిన సంగతి తెలిసి ఇద్దయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి. మృతుని కుమారుడు సందే యాదయ్యకు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సందే ఇద్దయ్య మృతి చాలా బాధాకరం అని కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, పల్లెటి నర్సింహ,సందే లక్ష్మయ్య, మల్లిగారి యాదయ్య, కటపాక వెంకటయ్య, సందే చంద్రయ్య, ఉడుత లింగయ్య, సందే అంజయ్య, సందే కిరణ్, రాజయ్యసాయి, వెంకటయ్య, రామలింగం పాల్గొన్నారు.



# పీవీకి ఎంపీ వద్దిరాజు ఘన నివాళులు

**హైదరాబాద్, ప్రజానావ:** మాజీ ప్రధానమంత్రి పీ.వీ.నర్సింహారావు జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావులు ఢిల్లీలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు.



# ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

## ఏడీఏ శ్రీలక్ష్మి

**చింతపల్లి, ప్రజానావ:** ఎరువుల దుకాణాల విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీస్కుంటామని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం చింతపల్లి మండల వ్యవసాయ అధికారి పీ .శ్రావణ కుమారితో కలిసి మాల్ పట్టణంలోని ఎరువుల దుకాణాల డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని అలాగే పురుగుల మందులను ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణాలను సైతం సీజ్ చేస్తామనిడ హెచ్చరించారు. ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని సూచించారు. అలాగే రైతులను ఉద్దేశించి వానాకాలం వేసిన పంటల వివరాలను సర్వేనెంబర్ వారీగా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మధు, శ్రీలత మరియు డీలర్లు యాదయ్య, వాసా శ్రీను, వెంకటయ్య, ప్రసాద్, శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో కల్కి ఫోబియా

## వసూళ్లలో భారీ రికార్డు

ప్రభాస్ 'కల్కి' సినిమా సంచలనం సృష్టిస్తోంది. పురాణాలకు సైన్స్‌ను ముడిపెట్టి నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రభాస్‌తో పాటు అగ్రనటీనటుల నటనకు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. రిలీజ్‌కు ముందే ఎన్నో రికార్డులు సొంతం చేసుకున్న 'కల్కి'.. విడుదల తర్వాత కూడా హవా కొనసాగిస్తోంది. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని హాలీవుడ్ రేంజ్‌లో రూపొందించారు. దీంతో అక్కడి ప్రేక్షకులనూ ఈ సినిమా మెప్పిస్తోంది. నార్త్ అమెరికాలో ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే పలు సినిమాల రికార్డులను బ్రేక్ చేసిన 'కల్కి'.. రిలీజ్ తర్వాత అన్నిటిని దాటి టాప్‌లో నిలిచింది. ప్రీమియర్స్ కలెక్షన్స్‌లోనే 3.8 మిలియన్ డాలర్లతో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డును సొంతం చేసుకుంది. ప్రీమియర్స్‌లోనే 'ఆర్ఆర్ఆర్' కలెక్షన్స్ క్రాస్ చేయడం విశేషం. ఈ సినిమా తర్వాత స్థానాల్లో 'ఆర్ఆర్ఆర్' (3.46మిలియన్లు), 'సలార్' (2.6ఓ), 'బాహుబలి2' నిలిచాయి. ప్రీమియర్స్, మొదటిరోజు కలెక్షన్స్ కలిపి అమెరికాలో 'కల్కి' 5 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. అమెరికాలో ఎక్కువ కలెక్షన్లు సాధించిన తెలుగు సినిమాల్లో 'కల్కి' ఒక్క రోజులోనే 5వ స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే అత్యంత వేగంగా 5 మిలియన్ల వసూలు చేసిన సినిమాగా రికార్డు నెలకొల్పింది. ఈ కలెక్షన్లు ఇలాగే కొనసాగితే బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఈ వీకెండ్‌కు కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.




## రికార్డుల కోసం సినిమా తీయలేదు

### కల్కి నిర్మాత స్వప్నదత్ స్పష్టీకరణ

ప్రభాస్ తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ' విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో దాని రికార్డ్స్ గురించి చర్చ నడుస్తూనే ఉంది. ప్రభాస్ గత చిత్రాల రికార్డులను ఇది క్రాస్ చేసిందా లేదా.. అంటూ నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. దీంతో ఈ విషయంపై నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ స్పందించారు. తాము రికార్డుల కోసం సినిమా తీయలేదని వెల్లడించారు. 'ఇతర సినిమాల రికార్డులను 'కల్కి' క్రాస్ చేసిందా? అని కొందరు అభిమానులు ఫోన్ చేసి అడగడం చాలా ఆశ్చర్యంగా, హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికే రికార్డులు సృష్టించిన వారెవ్వరూ మరోసారి వాటికోసమే సినిమాలు చేయరు. మేము ప్రేక్షకుల కోసం సినిమా తీశాం. ఎంతో ప్రేమతో దీన్ని రూపొందించాం అని పేర్కొన్నారు. ఇక 'కల్కి' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.180కోట్లు వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇండియాలో రూ.95కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు నార్త్ అమెరికాలో 3.8మిలియన్ల డాలర్ల కలెక్షన్స్‌తో కల్కి రికార్డు నెలకొల్పింది. అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డును సొంతం చేసుకుంది.





## భారతీయ సినీ పతాకను రెపరెపలాడించిన కల్కి

### నటుడు చిరంజీవి ప్రశంసల వర్షం

### నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిందన్న రాజమౌళి

ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంపై సినీ సెలబ్రిటీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నాగ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చి సూపర్ హిట్ టాక్ తెచ్చుకొంది. తాజాగా మెగాస్టార్, చిరంజీవి , రాజమౌళి ఈ చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో అభినందించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. 'కల్కి గురించి అన్ని చోట్ల చక్కని స్పందన వినిపిస్తోంది. నాగ్ అశ్విను మైథాలజీ, సైంటిఫిక్ జానర్ కథను ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపికా వంటి భారీ క్యాస్టింగ్‌తో అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నిర్మాతలు అశ్వినీదత్, ప్రియాంక, స్వప్నాలకు అభినందనలు. ప్యాషన్, కరేజ్‌తో టీమంతా సాధించిన సక్సెస్ ఇది. మన సినిమాలు భారతీయ జెండాను మరింత ఎత్తున రెపరెపలాడేలా చేస్తున్నాయని అన్నారు. రాజమౌళి సినిమా గురించి ట్వీట్‌లో రివ్యూ ఇచ్చారు. 'కల్కి' మూవీలో కొత్త ప్రపంచం నిర్మాణాన్ని ఇష్టపడ్డా. అద్భుతమైన సెట్టింగ్‌లతో ఇది నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. డార్లింగ్ తన టైమింగ్, టాలెంట్‌తో చంపేశాడు. అమితాబ్ జీ, కమల్ సర్, దీపిక నుంచి ఫుల్ సపోర్ట్ దొరికింది. అయితే సినిమా చివరి 30 నిమిషాలు నన్ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. నాగి, అలాగే మొత్తం వైజయంతి టీమ్‌కు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 1000 రెబల్ స్టార్‌లను కలిపితే అది ప్రభాస్ అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఐమాక్స్‌లో సినిమాను వీక్షించిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సినిమాని ఆదరించిన పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్, మా కుటుంబ అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.



## సైలెంట్‌గా ఓటిటిలోకి వచ్చేసిన సత్యభామ

సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ పోలీసు ఆఫీసర్‌గా నటించిన చిత్రం 'సత్యభామ' క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మెప్పించింది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అలరిస్తోంది. నవీన్‌చంద్ర కీలకపాత్రలో కనిపించిన ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరులు నటించారు. కె.సత్యభామ షీ టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షీ టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహహింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. ఆ తర్వాత హసీనా తన భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనాతోపాటు, ఎంతోమంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## సేనాపతి వయసుపై సందేహాలు

### అది ముఖ్యం కాదన్న దర్శకుడు శంకర్



కమల్ హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ 'భారతీయుడు2' 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 12న తమిళ, తెలుగు భాషలతో పాటు, ఇతర భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. అయితే, వృద్ధుడైన సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఫైట్స్ చేయడంపై సామాజిక మాధ్యమాల వేదికగా చర్చ నడుస్తోంది. ఎందుకంటే 'భారతీయుడు' చిత్రం జరిగే సమయానికి సేనాపతి పాత్రకు వయసు 75ఏళ్లుగా చూపించారు. ఆ లెక్క ప్రకారం 2024కు వచ్చే సరికి ఆ పాత్ర వయసు 103 సంవత్సరాలు. అంత వయసున్న వృద్ధుడు మార్షల్ ఆర్ట్స్ ఫైట్స్ చేయడం సాధ్యమేనా?అన్న ప్రశ్న దర్శకుడు శంకర్‌కు ఎదురైంది. దీనికి వివరణ ఇస్తూ సేనాపతి సాధారణ వ్యక్తిగా చూడొద్దని, సూపర్‌హీరోగా చూడాలంటూ సమాధానం ఇచ్చారు. 'సేనాపతి వృద్ధుడే కావచ్చు కానీ, సూపర్‌మ్యాన్. ఈ ప్రశ్న నన్ను చాలా మంది అడిగారు. నేను ఫస్ట్ పార్ట్ చేసినప్పుడు సీక్వెల్ గురించి ఆలోచనే లేదు. కేవలం ఆ ఒక్క చిత్రమే అనుకున్నా. అందుకు తగినట్లుగానే దాన్ని రాసుకున్నా. సేనాపతిని స్వాతంత్ర్య సమరయోధుడిగా చూపించాలనుకున్నా. అందుకే అతడి పుట్టిన సంవత్సరాన్ని అందులో చూపించాం. సేనాపతి గురించి పోలీసులు విచారణ చేసే క్రమంలో అతడు పుట్టిన సంవత్సరం ఏంటో తెలుస్తుంది. ఆ విషయం నాకు గుర్తు లేదు. ప్రస్తుతం సేనాపతి చైనాలో మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్‌గా కనిపిస్తాడు. అత్యధిక వయసు కలిగిన మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్స్ అక్కడ ఉన్నారు. లు జిజియన్ అనే ట్రైనర్ వయసు 108 సంవత్సరాలు. ఇప్పటికీ ఆయన యాక్టివ్‌గా ఉన్నారు. గాల్లో ఎగురుతూ కిక్ కూడా కొట్టగలరు. అది వారికున్న క్రమశిక్షణ, సాధన వల్ల సాధ్యమైంది. సేనాపతి కూడా అలాంటి వాడే. మర్మకళలో అతడు మాస్టర్. అందుకే నేను అతడిని సూపర్‌హీరోగా చూస్తా' అని శంకర్ చెప్పుకొచ్చారు. 'భారతీయుడు' కోసం వేసుకున్నట్లే ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడం విసుగ్గా అనిపించడం లేదా? అని కమల్‌ను ప్రశ్నించగా, 'సినిమా కథ ఆసక్తిగా లేకపోయినా, దర్శకుడు డిమాండ్ చేయకపోయినా అది సాధ్యమయ్యేది కాదు. ఇక ప్రోస్థటిక్ మేకప్‌లు వేసుకోవద్దని చాలా సార్లు అనుకునేవాడిని. కానీ, మంచి చిత్రాలు, కథలు రావటం వల్ల మళ్లీ నేను ఆ దిశగా పయనించాల్సి వస్తోంది' అని కమల్ అన్నారు. 'భారతీయుడు2'లో సిద్దార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, దివంగత నటుడు వివేక్, ప్రియా భవానీ శంకర్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

### లక్నేపల్లి నుంచి

# హస్తిన వరకు పయనం

**ప్రధాని పదవిని సొంతం చేసుకున్న సామాన్యుడు**

**దార్శనిక రాజకీయాలకు ఆదర్శంగా నిలిచిన పీవీ**



**వరంగల్, ప్రజానావ:** వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28న రుక్నాబాయి, సీతారామ రావు దంపతులకు పీవీ జన్మించాడు. భారదేశంలో ఓ సామాన్యుడు గద్దెనెక్కడం అనేది అంతా ఓ భ్రమ. పేరుకు ప్రజాస్వామ్య దేశమే అయినా, రాచరికాన్ని తలపించేలా పాలన మొత్తం తరతరాలుగా ఏదో ఒక్క కుటుంబం చేతిలోనే ఉంటుందనేది భారతీయులందరికీ తెలిసిన సత్యం. అయితే ఆ ఆనవాయితీని ఛేదిస్తూ, 1991వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా దక్షిణభారత దేశం నుంచి ఒకవ్యక్తి, అందులోనూ తెలుగువాడు అయిన పీవీ నరసింహారావు దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఒకగాడిలోకి తీసుకురాగలిగారు. ప్రజల్లోఆర్థిక భద్రత, ఒక నమ్మకం కల్పించడంలో పీవీ ఎంతో కృషి చేశారు. అందుకే ఆర్థిక సంస్కరణల జాతిపితగా పీవీ నరసింహా రావు కీర్తి గడించారు.అంతేకాదు.. ఒక గొప్ప వ్యూహకర్త, అపర చాణక్యుడిగా పేరు పొందారు.మంచి రాజనీతిజ్ఞుడిగా కూడా పేరు, ప్రత్యర్థి పార్టీల నుంచి కూడా గొప్ప ప్రధానమంత్రిగా ప్రశంసలు అందుకున్న ఏకైక వ్యక్తి పీవీ మాత్రమే.కానీ ఆ సమయం నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించి, పేదరికం పెరిగిపోయి, అత్యంత క్లిష్ట పరిస్థితులు ఉన్నాయి. అంతా శూన్యం, దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలో దిక్కుతోచని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించిన పీవీ తనదైన ఆలోచనలతో, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి ఒక దశా-దిశా ఇచ్చి తన సత్తా ఎంటో చూపించారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. అపర చాణుక్యుడు అంటూ ఆయనను కీర్తించినా రాజకీయాల కోసం తన చాణక్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. సానుకూల, ప్రతికూల రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి.. తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు. నిజానికి పివి హయాం తరవాత సంకీర్ణాలు మొదలయ్యాయి. పివి కూడా ఆనాడు సంకీర్ణ రాజకీయాలకు తెరతీసి ఉంటే దేవేగౌడ స్థానంలో మళ్లీ పివియే ప్రధాని అయ్యేవారు. తనకున్న స్థానాలతో తానే మరోమారు ప్రధానిగా అయ్యేందుకు సంకీర్ణ రాజకీయాలు నెరపి ఉంటే భారత చరిత్ర మరోలా ఉండేది. అయినా ఆయన పాలనా కాలం ఓ స్వర్ణయుగం. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా,ఆర్థిక సంస్కరణలను అద్వితీయంగా అమలుపరిచిన పాలనాదక్షుడిగా పీవీ నరసింహారావు చరిత్ర సృష్టించారు. అందుకే బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. ఆయన పాలనా ఫలితాలు, ఫలాలు నేటికీమనమంతా అనుభవిస్తూనే ఉన్నాం. వాటి నుండి పాఠాలు నేర్చుకోవడంలో మాత్రం వెనకబడి ఉన్నాం.

### సేంద్రియ వ్యవసాయామే

# ఆరోగ్యానికి రక్ష

**• రసాయన ఎరువుల వాడకంతో క్యాన్సర్ • భూసారం తగ్గితే మట్టి మనుగడే కష్టం**



**నిజామాబాద్, ప్రజానావ:** రోజురోజుకూ తగ్గిపోతున్న భూసారాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో పంటలు పండాలంటే చాలా కష్టంగా మారే పరిస్థితులు కన్పిస్తున్నాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల దుష్ఫలితాలు వస్తున్నారు. అనేకరకాలన క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నాం. సేంద్రియ ఎరువుల ను అశ్రద్ధ చేస్తూ.. అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తుండడంతో భూసారం క్రమంగా కనుమరుగవుతోంది. దానిని కాపాడుకోకపోతే రైతులకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. సేంద్రియ వ్యవసాయం పెరగకుంటే భూసారం తగ్గి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు విరివిగా రసాయన ఎరువుల వాడకం వల్ల ఏటేటా భూసారం తగ్గిపోతుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానకాలం పంటలు వేసే సమయం ఆసన్నమైనందున భూసారాన్ని కాపాడడం కోసం పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలు, ఉండాల్సిన లక్షణాలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. శువుల ఎరువులు తక్కువ అవుతున్న తరుణంలో పచ్చిరొట్టను పైర్లసాగులో భాగం చేసుకోవడం తప్పనిసరని అన్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు విపరీతంగా రసాయన మందులను వినియోగి స్తున్నారు. దీంతో భూమి క్రమంగా తన సారాన్ని కోల్పోతోంది. దీనివల్ల అధిక దిగుబడులు రాకపోగా పంటలకు నష్టం కలగడం, భవిష్యత్తులో పూర్తిగా భూమి నిస్సారం కావడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ పరిస్థితులను అధిగమించి సుస్థిరమైన దిగుబడులు, పొందాలంటే భూసారాన్ని కాపాడడం ఒక్కటే మార్గం. అందుకోసం సేంద్రియ ఎరువులను పోషకాల యాజమాన్యాల్లో భాగం చేయాల్సిన అవసరం ఉంది. పచ్చిరొట్ట వాడడం వల్ల భౌతిక, రసాయన, జీవ లక్షణాలు వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు అందించే అవకాశం ఉంది. నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే శక్తి పెరుగుతుంది. నేల గుల్లబారి మురుగునీటి వ్యవస్థ మెరుగు పడుతుంది. నేలలో సూక్ష్మజీవులు పెరుగుతాయి. అనేక జీవ రసాయన చర్యలు జరిగి పోషకాలు మొక్కలకు అందుతాయి. చీడపీడల ఉధృతిని తగ్గిస్తాయి. పచ్చిరొట్ట తరువాత వేసే పైర్లకు 25 శాతం నత్రజని తగ్గించవచ్చు. చౌడు నేలలు కూడా సారవంతంగా మారుతాయి. ఆ నేలల్లోనూ ఉత్పాదకత పెంచుకోవచ్చు. త్వరగా పెరిగి ఎక్కువగా పచ్చిరొట్టను అందిస్తుంది. పీచుపదార్థం తక్కువగా ఉంటుంది. త్వరగా కుళ్లి భూమిలో కలిసేటట్లు చేస్తుంది. పుష్పజాతి పంటలు ఎంపిక చేసుకుంటే వేరు బుడిపెల ద్వారా గాలిలో నత్రజని స్థిరీకరిస్తుంది. లోతైన వేరు వ్యవస్థ కలిగి నీటి ఎద్దడిని తట్టుకునేలా చేస్తుంది. కలుపు మొక్కలను అరికడుతుంది. అన్ని రకాలైన నేలల్లో పెరిగి నమ్మకమైన దిగుబడిని ఇచ్చేలా చేస్తుంది. చౌడు భూములు, వరి పండించే భూములకు జీలుగులు అనుకూలం. తేలికపాటి ఇసుక నేలల్లోనూ సాగు చేయొచ్చు. ఉరుబుడిపెలు ఎక్కువగా ఉండి నత్రజనిని ఎక్కువ స్థిరీకరిస్తుంది.ఒక టన్ను పచ్చిరొట్టలో సుమారు 6 కిలోల నత్రజని 1 నుంచి 1.5 కిలోల భాస్వరం, 5 కిలలో పొటాషియం లభిస్తాయి.జనుమును అన్ని రకాల నేలల్లో సాగు చేయొచ్చు. పచ్చిరొట్ట పశుగ్రాసానికి ఉపయోగ పడుతుంది. ఎకరాకు 12 నుంచి 14 కిలోల విత్తనాల చల్లుకోవాలి. పూత దశలో కలియదున్నడం వల్ల ఎకరానికి సుమారు 4 నుంచి 5 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. దీనిని ప్రతి ఒక్కరూ నాటుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# జియో బాటలో ఎయిర్‌టెల్

**• భారీగా పెరగనున్న రీఛార్జ్ ధరలు • జూలై 3 నుంచి అమల్లోకి కొత్త ధరలు**




**ముంబై, జూన్ 28 :** మొబైల్ ఫోన్ వినియోగదార్లకు వరుసగా రెండు షాక్‌లు తగిలాయి. ధరలు పెంచుతూ రిలయన్స్ జియో ప్రకటించిన వెంటనే, భారతి ఎయిర్‌టెల్ కూడా రేట్లను పెంచింది. ఎయిర్‌టెల్ సిమ్ వినియోగించాలంటే యూజర్లు ఇకపై 10 శాతం నుంచి 21 శాతం ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాలి. పెరిగిన భారతి ఎయిర్‌టెల్ టారిఫ్‌లు జులై 3 నుంచి అమలులోకి వస్తాయి. ఆ తేదీ నుంచి పోస్ట్ పెయిడ్ / ప్రి-పెయిడ్ రేట్లు పెరుగుతాయి. ఎయిర్‌టెల్ కస్టమర్లకు ప్రస్తుతం ఉన్న రేట్లు జులై 2వ తేదీ వరకు వర్తిస్తాయి. భారతదేశంలోని టెలికాం కంపెనీలు ఆర్థికంగా బలంగా ఉండాలంటే 'ప్రతి వినియోగదారు నుంచి వచ్చే సగటు ఆదాయం' రూ. 300 పైగా ఉండాలని భారతి ఎయిర్‌టెల్ స్టాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. 300 దాటితే... నెట్‌వర్క్ టెక్నాలజీ , స్పెక్ట్రమ్ కోసం పెద్ద మొత్తంలో అవసరమయ్యే పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని, మూలధనంపై సాధారణ రాబడిని పొందగమని తాము నమ్ముతున్నట్లు ఎక్సేంజ్ ఫైలింగ్‌లో భారతి ఎయిర్‌టెల్ పేర్కొంది. సామాన్య ప్రజల బడ్జెట్‌పై ఎలాంటి భారం లేకుండా, ఎంట్రీ-లెవల్ ప్లాన్ రేట్లను చాలా తక్కువ మొత్తంలో అంటే రోజుకు 70 పైసల కంటే తక్కువ పెంచినట్లు వెల్లడించింది. గురువారం, రిలయన్స్ జియో కూడా తన మొబైల్ ప్లాన్ రేట్లను 12 శాతం నుంచి 27 వరకు పెంచింది. జియో కొత్త టారిఫ్‌లు కూడా జులై 3 నుంచి అమల్లోకి వస్తాయి. జులై 2వ తేదీ వరకు ప్రస్తుత రేట్లే అమల్లో ఉంటాయి. రిలయన్స్ జియో... తన నెలవారీ (28 రోజులు) ప్లాన్‌లు, 2 నెలలప్లాన్లు (56 రోజులు), 3 నెలల ప్లాన్లు (84 రోజులు), వార్షిక ప్లాన్ల (335 / 336 రోజులు) మొత్తాన్ని పెంచింది. 28 రోజుల ప్లాన్ ధరలను 27 శాతం వరకు, 84 రోజుల ప్లాన్లను 20 శాతం వరకు రిలయన్స్ జియో పెంచింది. డేటా యాడ్-ఆన్ ప్యాక్‌లు, పోస్ట్ పెయిడ్ టారిఫ్ రేట్లను సైతం జియో పెంచింది. దీంతో... కొత్త ప్లాన్లు కనిష్టంగా రూ. 189 నుంచి గరిష్టంగా రూ. 3,599 వరకు చేరాయి. ప్రస్తుతం ఇవి కనిష్టంగా రూ. 155 - గరిష్టంగా రూ. 2,999 మధ్యలో ఉన్నాయి. జియో యాడ్-ఆన్ కొత్త ధరలు కనిష్టంగా రూ. 29 నుంచి గరిష్టంగా రూ. 69 వరకు ఉన్నాయి. పోస్ట్ పెయిడ్ విషయానికి వస్తే... ప్రస్తుతం రూ. 299 జులై 03 నుంచి రూ. 349 అవుతుంది. ప్రస్తుతం రూ. 399గా ఉన్న ప్లాన్ కోసం జులై 03 నుంచి రూ. 449 చెల్లించాల్సి వస్తుంది. వాస్తవానికి, టెలికాం కంపెనీలు ఈ ఏడాది ప్రారంభంలోనే టారిఫ్ రేట్లు పెంచాల్సి ఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ఆగాయి.



# ఘనంగా పీవీ జయంతి

**ఉభయ తెలుగు రాష్ట్రా ల్లో నివాళి**

**పీవీ ఘాట్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు**

**హైదరాబాద్, ప్రజానావ:** దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢిల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహారావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు.తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు.

### ఉర్రూతలూగించిన

# వందేమాతరం

**గీత రచయిత బంకించంద్ర చటర్జీ**



**కోల్‌కతా, జూన్ 28 :** స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది భారతీయులను ఉర్రూతలూగించిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ. ఆనందమఠం అనే నవలలో మాతృభూమిని దుర్గాదేవితో పోలుస్తూ ఈ స్తోత్రాన్ని వ్రాశారు. ఆయన బెంగాలీ భాషలో ఇంకా అనేక నవలలు, కథలు, కథానికలు రచించారు. బంకించంద్ర జూన్ 27, 1838న బెంగాలు రాష్ట్రంలోని నైహతి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు యాదవ చంద్ర చటర్జీ, దుర్గాదేవి. యాదవ చంద్ర చటర్జీ మిడ్నాపూర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేశారు. బంకించంద్ర విద్యాభ్యాసం హుగ్లీ మరియు కలకత్తాలో జరిగింది. 1857లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజి నుంచి డిగ్రీ పొందారు. తండ్రివలెనే బంకించంద్ర కూడా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. 1891లో డిప్యూటీ మెజిస్ట్రేటుగా పదవీ విరమణ చేశారు. వారి ఉద్యోగ సమయంలో ఎప్పుడు బ్రిటిష్ అధికారులకు తలవంచలేదు. బెంగాలీ భాషలో మొదటి నవల దుర్గేష్ నందిని 1865లో బంకించంద్ర రచించారు. 'బంగదర్శన్' అనే మాస పత్రికను ఏప్రిల్ 1872లో ఆయన ప్రారంభించారు. వందేమాతర గీతం అనగానే బంకించంద్ర ఛటర్జీ స్ఫురినిస్తారు.ఆ ప్రఖ్యాత రచయిత ఒక సందర్భంలో రామకృష్ణ పరమహంసను దర్శించుకోగా, 'నీ జీవన లక్ష్యం ఏమిటి? ' అనడిగారాయన. 'కుటుంబ పోషణ' అన్నారు బంకించంద్ర. పరమహంస తీవ్రంగా స్పందిస్తూ 'ముల్లంగి తింటే ఆ త్రేన్పులే వస్తాయి. సంసారమే సర్వమని భావిస్తే ఆలోచనలు ఇలాగే ఉంటాయి' అని, ఆధ్యాత్మిక జీవన ప్రాముఖ్యం గురించి చెప్పారు. పరమహంస సాంగత్యంతో బంకించంద్రుని ఆలోచనా ధోరణెళి మారిపోయింది. మనసు ప్రాపంచిక విషయాల నుంచి ఆధ్యాత్మికత వైపు మరలి, క్రమంగా వేదాంతిగా మారిపోయారు. లౌకిక కథనాలతో కూడిన సాహిత్యాన్ని వదిలేశారు. దైవచింతన పెంచుకుని ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న రోజుల్లో ఒకసారి బంకించంద్ర తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. అయినా శరీర అస్వస్థతను పట్టించుకోకుండా ఆధ్యాత్మిక గ్రంథ పఠనంలో లీనమయ్యారు. అప్పుడో ప్రముఖ వైద్యుడు వారి ఇంటికి వచ్చి 'ఔషధం' తీసుకోకపోతే ఎలా ప్రాణాపాయాన్ని కొనితెచ్చుకుంటారా? !' అంటూ హెచ్చరించారు. దానికి స్పందిస్తూ బంకించంద్ర 'మందులు తీసుకోకపోవటమేంటి! రోజూ ఒక ఔషధాన్ని వాడుతున్నానే!' అన్నారు. వైద్యుడు ఆశ్చర్యంగా 'ఏదీ చూపండి' అనడిగారు. 'ఇదిగో' అంటూ చెంతనే ఉన్న భగవద్గీత చూపి, ప్రాపం చిక రుగ్మతలకూ ఇంతకంటే దివ్య ఔషధం లేదు' అన్నారు.

www.prajanaava.in || హైదరాబాద్ శనివారం, జూన్ 29, 2024 || ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..

# సిల్లీగా మాట్లాడటం మానేయండి

## సాకులు చెప్పడానికి బుద్ధుండాలి

## ఇంగ్లాండ్ మాజీ ప్లేయర్లకు భజ్జీ కౌంటర్



**ముంబై:** సెమీఫైనల్‌లో భారత్ చేతిలో తమ జట్టు ఓటమిపాలవ్వడాన్ని ఇంగ్లండ్ మాజీలు జీర్ణించుకోలేకపోతున్నారు. సెమీస్ జరిగిన వేదిక టీమిండియాకు అనుకూలంగా ఉందని, అందుకే తమ జట్టుపై పైచేయి సాధించిందని అంటున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా మండిపడ్డాడు. ఇరు జట్లు ఒకే వేదికపై ఆడాయని, కాస్త బుర్రతో ఆలోచించి మాట్లాడాలని ధ్వజమెత్తాడు. గయానా వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్‌లో భారత్ 68 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 171 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (57బీ 39 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (47బీ 36 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) సత్తాచాటారు. మ్యాచ్ అనంతరం ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైకేల్ వాన్ భారత విజయం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఫైనల్‌కు చేరేలా పిచ్, వేదిక ప్రతీది కలిసొచ్చిందని హుస్సేన్ అన్నాడు. మరోవైపు మైకేల్ వాన్ ఎప్పటిలానే వివాదాస్పద ట్వీట్ చేశాడు. 'సూపర్-8లో సౌతాఫ్రికాపై విజయం సాధించి ఉంటే ట్రిండాడ్ వేదికగా ఇంగ్లండ్ సెమీఫైనల్ ఆడేది. అప్పుడు అఫ్గానిస్థాన్‌పై తప్పక గెలిచేది. కాబట్టి దాని గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవు. అయితే గయానా వేదిక మాత్రం భారత్‌కు కలిసొచ్చేలా చక్కని ఎంపిక' అని వాన్ భారత్‌పై అక్కసుతో ట్వీట్ చేశాడు. ఈ వ్యాఖ్యలకు హర్భజన్ సింగ్ స్పందిస్తూ.. భారత్‌కు గయానా మంచి వేదిక అని మీరెలా అనుకుంటున్నారు? ఇరు జట్లు ఒకే వేదికపై ఆడాయి. అంతేగాక ఇంగ్లండ్ టాస్ గెలిచి అదనపు ప్రయోజనం పొందింది. సిల్లీగా మాట్లాడటం మానేయండి. అన్ని విభాగాల్లో ఇంగ్లండ్‌పై టీమిండియా గొప్ప ప్రదర్శన చేసింది. వాస్తవాన్ని అంగీకరించి, ముందుకు వెళ్లండి. ఈ చెత్త మాటలు మీ దగ్గరే ఉంచుకోండి. నాన్సెన్ కాదు, లాజిక్‌తో మాట్లాడండి' అని హర్భజన్ ట్వీట్ చేశాడు.

# న్యూ లుక్‌లో మిస్టర్ కూల్

## హీరోలా ఉన్నావంటూ అభిమానుల కామెంట్స్




**ముంబై:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ క్రేజ్ గురించి ప్రత్యే కంగా చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగి నాలుగేళ్లు అవుతున్నప్పటికీ ఎంఎస్‌డీ ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం తగ్గలేదు. ఇంకా చెప్పాలంటే అంతకం తకూ పెరుగుతూ వస్తోంది. ఇందుకు ఇటీ వల జరిగిన ఐపీఎల్ మ్యాచులే నిదర్శనం. తలా బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతిసారి అతడి నామస్మరణతోనే స్టేడియాలు దద్దరిల్లిపోయాయి. మహేంద్రుడు క్రికెట్‌తో పాటు ఫ్యాషన్‌ను కూడా బాగా ఫాలో అవుతుంటాడనే విషయం తెలిసిందే. అందుకే అతడు తరచూ ట్రెండీ లుక్స్‌లో దర్శనమిస్తుంటాడు. దీనిలో భాగంగా తరచుగా తన హెయిర్ స్టైల్ ను మారుస్తూ ఉంటాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 17వ సీజన్‌లో లాంగ్ హెయిర్‌తో మహీ వింటేజ్ లుక్‌లో కనిపించాడు. ఇటీవలే ఓ యాడ్ షూట్ కోసం ధోనీ లాంగ్ హెయిర్ పెంచుకున్న విషయం కూడా బయట పడింది. అప్పుడు తన హెయిర్ స్టైల్స్ వల్ల కలిగే ఇబ్బందుల గురించి మిస్టర్ కూల్ ఓ ఇంటర్వ్యూలో వివరించారు. 'ఫ్యాన్స్ ఇష్టపడుతున్నారని లాంగ్ హెయిర్ పెంచుకుంటున్నా. అయితే యాడ్స్ షూటింగ్ కోసం రెడీ అవ్వడానికి లాంగ్ హెయిర్ వల్ల ఆలస్యం అవుతోంది. గతం లో 20 నిమిషాల్లో మేకప్ పూర్తి అయ్యేది. కానీ ఇప్పుడు రెడీ అవ్వడానికి గంట అయిదు నిమిషాల నుంచి గంట పది నిమిషాల వరకు సమయం పడుతోంది. మేకప్ కోసం అంతసేపు కుర్చీలో కూర్చొని ఉండటం బోరింగ్‌గా అనిపిస్తోంది. కానీ నా ఫ్యాన్స్ అందరూ హెయిర్ స్టైల్ బాగుందని చెబుతున్నారు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా ఓపెనర్!




**చెన్నై:** టీమిండియా మహిళా ఓపెనర్ షెఫాలీ వర్మ చరిత్ర సృష్టించింది. మహిళల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా డబుల్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా రికార్డుకెక్కింది. సౌతాఫ్రికాతో చెన్నై వేదికగా శుక్రవారం మొదలైన ఏకైక టెస్ట్‌లో షెఫాలీ వర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ సాధించింది. 197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్స్‌లతో 205 పరుగులు చేసి పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో 194 బంతుల్లోనే డబుల్ సెంచరీ నమోదు చేసిన షెఫాలీ వర్మ.. ఆస్ట్రేలియా బ్యాటర్ అన్నబెల్ సదర్లాండ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డ్‌ను అధిగమించింది. ఈ ఏడాది ప్రారంభంలో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో సదర్లాండ్ 248 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించింది. ఇప్పటి వరకు ఇదే ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీగా కొనసాగగా.. షెఫాలీ వర్మ ఆ రికార్డును తిరగరాసింది. అంతేకాకుండా భారత్ తరఫున డబుల్ సెంచరీ నమోదు చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా కూడా షెఫాల్మీ వర్మ రికార్డు నమోదు చేసింది. అప్పుడెప్పుడో షెఫాలీ వర్మ పుట్టకముందు 22 ఏళ్ల క్రితం టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్.. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 407 బంతుల్లో 214 పరుగులతో డబుల్ సెంచరీ సాధించింది. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత 20 ఏళ్ల షెఫాలీ వర్మ భారత్ తరఫున మరో డబుల్ సెంచరీ నమోదు చేసింది.

### తొలిరోజు భారత జట్టు జోరు

షెఫాలీ వర్మ డబుల్ సెంచరీకి తోడుగా స్మృతి మంధాన(161 బంతుల్లో 27 ఫోర్లు, సిక్స్‌తో 149) శతక్కొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 98 ఓవర్లలో 4 వికెట్లకు 525 పరుగులు చేసింది. దాంతో తొలి రోజే 500 పరుగులు చేసిన జట్టుగా భారత్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. క్రీజులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(42 బ్యాటింగ్), రిచా ఘోష్(43 బ్యాటింగ్) ఉన్నారు.తొలి వికెట్‌కు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన(149) 292 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.




# ఏటీఎమ్ కార్డు ఉందా.?

## అయితే మీకు రూ.10లక్షల బీమా ఉన్నట్లే..

**ముంబై:** ప్రస్తుతం బ్యాంక్ ఖాతా లేని వారు లేరని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వ పథకాలు మొదలు అన్నింటికీ బ్యాంకు ఖాతా అనివార్యంగా మారింది. దీంతో సహజంగానే ఏటీఎమ్‌ల వినియో గం కూడా పెరిగింది. వీటిలో డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు ఉంటాయని తెలిసిందే. అయితే మనం ఉపయోగించే ఏటీఎమ్ కార్డులపై బీమా ఉంటుందని మీలో ఎంత మందికి తెలుసు. అవును కార్డుల ఆధా రంగా ఏకంగా రూ.10లక్షల వరకు కూడా బీమా అందిస్తారు. ఇంతకీ ఏ కార్డులపై ఎంత బీమా వర్తిస్తుంది.? వీటిని ఎలా క్లైమ్ చేసుకుంటారో ఇప్పుడు తెలుసుకుందాం.. ఎస్‌బీఐ గోల్డ్ మాస్టర్ కార్డ్ లేదా వీసా కార్డ్ కలిగి ఉన్న వారికి రూ.4లక్షల ఎయిర్ డెత్ (విమాన ప్రమాదాల్లో మ-రణిస్తే), రూ.2లక్షల నాన్ ఎయిర్ ఇన్సూరెన్స్ కవర్ అవుతుంది. ఇక ప్రీమియం కార్డ్ హోల్డర్స్‌కు రూ.10లక్షల ఎయిర్ డెత్, రూ.5లక్షల నాన్ ఎయిర్ కవర్ లభిస్తుంది. కాగా సాధారణ మాస్టర్‌కార్డ్‌పై రూ. 50 వేలు, ప్లాటినం మాస్టర్‌కార్డ్‌పై రూ. 5 లక్షల రూపాయలు, వీసా కార్డుపై రూ.2లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారు. అలాగే ప్రధాన మంత్రి జనధన్ యోజన కింద ఓపెన్ చేసిన వారికి రూ.1 నుంచి రూ.2లక్షల వరకు ఇన్సూరెన్స్ లభిస్తుంది. అయితే ప్రమాదం జరిగిన తేదీ నుంచి 90 రోజుల ముందు ఏటీఎమ్ కార్డుతో ఏదైనా లావాదేవీ చేస్తేనే బీమా క్లెయిమ్ చేసుకోవడానికి అర్హులు. ప్రమాదం జరిగితే, క్లెయిమ్ చేయడానికి ఆసుపత్రి బిల్లు, చెల్లుబాటు అయ్యే సర్టిఫికేట్, పోలీసుల ఎఫ్ఐఆర్ కావాల్సి ఉంటుంది. ఏటీఎమ్ ఉన్న వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే నామినీ డెత్ సర్టిఫికేట్‌ను అందించాల్సి ఉంటుంది.క్లెయిమ్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అప్లై చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ విధానంలో అప్లై చేసుకునే వారు బ్యాంకుకు వెళ్లి ఫామ్‌ను ఫిల్ చేయాల్సి ఉంటుంది. క్లెయిమ్ చేయగానే బ్యాంకు ఒక అధికారికి నియమిస్తుంది. అనంతరం అధికారులు దర్యాప్తు చేస్తారు. వెరిఫికేషన్ తర్వాత తుది నివేదికను సిద్ధం చేస్తారు. ఆ తర్వాత, క్లెయిమ్ మొత్తం 10 రోజుల వ్యవధిలో అందిస్తారు. ప్రమాదం జరిగిన 60 రోజుల్లోపు క్లెయిమ్ చేసుకుంటే బీమా మొత్తం పొందొచ్చు లేదంటే క్లెయిమ్‌ను తిరస్కరించే అవకాశాలు ఉన్నాయి.

# ఈ రైల్వే స్టాక్ హాట్ కేక్..

## ఏకంగా 27శాతం వడ్డీతో టాక్ ఆఫ్ ది మార్కెట్..

**ముంబై:** ప్రస్తుతం మార్కెట్లో అత్యధిక రాబడినిచ్చే మార్గాలు ఏమైనా ఉన్నాయంటే అది షేర్, స్టాక్ మార్కెట్లని కచ్చితంగా చెప్పొచ్చు. అయితే వాటిల్లో ఎంత రాబడి ఉంటుందో.. అంతే స్థాయిలో రిస్క్ కూడా ఉంటుంది. పరిస్థితులు వేగంగా మారిపోతుంటాయి. మార్కెట్ ఎప్పుడు ఎలా స్పందిస్తుందో అంచనా వేయడం, అర్థం చేసుకోవడం అంత సులభమైంది ఏమి కాదు. అయితే దానిపైనే ఉండే కొంతమంది నిపుణులు మాత్రం ఏ స్టాక్ పుంజుకుంటుంది? ఏ స్టాక్ లో పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మంచి లాభాలు వస్తాయన్న అంశాలను లెక్కించి సూచనలు చేస్తుంటారు. అలాగే ప్రస్తుతం భారతీయ రైల్వేకు ఫైనాన్సింగ్ చేసే ఓ కంపెనీకి ఓ మల్టీ బ్యాగర్ స్టాక్ గురించి అంతా చర్చించుకుంటున్నారు. ఇది దీర్ఘకాలం సస్టైన్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ స్టాక్ ఏంటి? దాని పరిస్థితి ఏంటి? తెలుసుకుందాం రండి..

### రైల్వే పీఎస్‌యూ స్టాక్ ఐఆర్ఎఫ్‌సీ..



రైల్వే పీఎస్‌యూ స్టాక్ ఐఆర్ఎఫ్‌సీని దీర్ఘకాలానికి కొనుగోలు చేయాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. రైల్వేల నుంచి కంపెనీలకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయని.. రైల్వే కంపెనీల నిధుల అవసరాలను ఈ ఐఆర్ఎఫ్సీ తీరుస్తుందని వివరిస్తున్నారు. ఇది చాల పెద్ద సంస్థని, దేశ వ్యాప్తంగా చేపట్టే రైల్వే ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ చేయడంలో ఈ సంస్థ ప్రత్యేకత కలిగి ఉందని చెబుతున్నారు..ఈ కంపెనీ ఎన్‌సీఏ పూర్తిగా శూన్యం. ఇటీవల ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇది కూడా పెద్ద సానుకూలాంశం. కంపెనీకి బలమైన ఫండమెంటల్స్ ఉన్నాయి. కంపెనీ భవిష్యత్తులో వృద్ధికి మంచి అవకాశం ఉంది. కొనుగోలు స్టాక్‌లో 9 నుంచి 12 నెలల వరకూ పెట్టుబడులు పెట్టొచ్చు. దీనిలో 27 శాతం కంటే ఎక్కువ రాబడులు ఊహించవచ్చని చెబుతున్నారు.

### మార్కెట్లో జోష్..

మార్కెట్ అస్థిరత కారణంగా భారతీయ ఈక్విటీ బెంచ్‌మార్క్‌లు భారీగా ముగిశాయి. సెన్సెక్స్ 131 పాయింట్లు లేదా 0.17 శాతం పెరిగి 77,341 వద్ద, నిఫ్టీ 36 పాయింట్లు లేదా 0.18 శాతం పెరిగి 23,537 వద్ద ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 147 పాయింట్లు (0.27 శాతం) పెరిగి 55,577 వద్దకు చేరుకుంది. అయితే, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 18 పాయింట్లు (0.10 శాతం) పడిపోయి 18,217 వద్దకు చేరుకుంది. సెక్టోరల్ ఇండెక్స్‌లలో ఎఫ్ఎంసీజీ, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ ఇండెక్స్‌లు అత్యధికంగా లాభపడ్డాయి. పీఎస్ యూ బ్యాంక్, మెటల్, మీడియా, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు వెనుకబడి ఉన్నాయి.

# రిలయన్స్ సరికొత్త రికార్డు..

## దేశంలోనే తొలి కంపెనీగా ఘనత.

**ముంబై:** స్టాక్ మార్కెట్ సూచీలు ఎప్పుడు ఎలా కదలాడతాయో ముందుగానే ఊహించడం కాస్త కష్టమేనని చెప్పొచ్చు. ఎన్నో అంశాలు దీనిని ప్రభావితం చేస్తుంటాయి. ఇంకా రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి హెవీ వెయిట్ షేర్లు స్టాక్ మార్కెట్ కదలికలపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. కొద్దిరోజులుగా మార్కెట్ విపరీతంగా పుంజుకుంటున్నప్పటికీ ఇదే సమయంలో దేశంలో మార్కెట్ విలువ అన్నింటికంటే ఎక్కువగా ఉన్న దిగ్గజ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ పెద్దగా రాణించింది లేదు. అయితే ఇప్పుడు మాత్రం పరిస్థితి మారిపోయింది. సడెన్‌గా విపరీతంగా పుంజుకుంటోంది. ఇదే సమయంలో కొత్త కొత్త రికార్డుల్ని సృష్టిస్తోంది. వరుసగా నాలుగో సెషన్‌లో కూడా ఇప్పుడు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ముందుకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో 4 రోజుల్లోనే దాదాపు 10 శాతం పెరగడం విశేషం. ఇదే క్రమంలో ఈ స్టాక్ 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసింది. శుక్రవారం సెషన్‌లో దాదాపు 3 శాతం లాభంతో ఇంట్రాడేలో రూ. 3162 వద్ద ఆల్ టైమ్ గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలోనే ఈ షేర్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకు అదిరిపోయే ప్రాఫిట్స్ దక్కుతున్నాయని చెప్పొచ్చు. మరోవైపు ఇదే సమయంలో మరో సరికొత్త రికార్డును కూడా సృష్టించడం విశేషం.

### రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్..

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం రూ. 21.30 లక్షల కోట్లుగా ఉంది. అయితే దేశంలోనే మార్కెట్ విలువలో ఈ మైలురాయిని అధిగమించిన భారత తొలి కంపెనీగా నిలిచింది. మరే కంపెనీ కూడా కనీసం రూ.20లక్షల కోట్ల మార్కును కూడా తాకలేదు. దీంతో దేశంలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద కంపెనీగానే కొనసాగుతోంది రిలయన్స్ సంస్థ. ఈ ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్.. బెంచ్‌మార్క్ ఇండెక్స్‌ను దాటి మంచి ప్రదర్శన చేస్తోంది. మంచి లాభాలు సాధించింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సెన్సెక్స్ 10 శాతం పెరిగితే.. ఇదే క్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ మాత్రం 21 శాతం పెరిగింది. గతేడాది కూడా రిలయన్స్ షేరు 36 శాతం పెరగ్గా.. ఈ క్రమంలో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 25 శాతం మాత్రమే పెరిగింది.




### జియో టారిఫ్స్ పెంపు..

ఇవాళ రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ పుంజుకునేందుకు ప్రధాన కారణం జియో టారిఫ్స్ పెంపు అని తెలుస్తోంది. రిలయన్స్ జియో.. తమ రీఛార్జి ప్లాన్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. గరిష్టంగా 25 శాతం వరకు రేట్లు పెరగడం గమనార్హం. ఇది జులై 3 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతోనే రిలయన్స్ స్టాక్ దూసుకెళ్తోంది. అయితే స్టాక్ మార్కెట్ సూచీలు మాత్రం ఒడుదొడుకుల్లో కొనసాగుతున్నాయి.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116